క్లుప్తంగా

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కథలాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులకు కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. మండలంలోని చింతకుంటలో ఉపాధిహామీ పనులు, కాల్వల మరమ్మతుల పనులను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో కూలీల హాజరును పెంచాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఏపీవో రాజేందర్, కార్యదర్శి మోహన్ ఉన్నారు.

నర్సరీల నిర్వహణపై శ్రద్ధ చూపాలి


మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెగడపల్లి: గ్రామాల్లోని వన నర్సరీలపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కీచులాటపల్లి, నర్సింహునిపేట, రాజరాంపల్లి గ్రామాల్లో వననర్సరీలను శనివారం ఎంపీవో మహేందర్‌తో కలిసి సందర్శించారు. నాటిన మొక్కలు, వాటి పెంపకం కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ ఏడాది గ్రామానికి 10 వేల మొక్కలను నాటేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, తాజామాజీ సర్పంచులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మల్యాల: వరిలో విత్తన శుద్ధి చేసుకోవడంతో తెగుళ్ల నివారించవచ్చని, రైతులు స్వయంగా విత్తన శుద్ధి చేసుకోవచ్చని వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రామన్నపేటలో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు వరిలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో తొలి దశలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు విత్తన శుద్ధి ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో రామన్నపేట రైతులు కళాశాల విద్యార్థులు సీహెచ్.రాఘవేంద్ర, ఎస్‌వీ.రాజవర్ధన్, పి.రాజవర్ధన్, జే.వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' లబ్ధిదారుల ఆన్‌లైన్ కేంద్రం


దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్

కోరుట్ల: పట్టణంలోని 26వ వార్డులో గృహలక్ష్మి లబ్ధిదారుల కోసం స్థానిక ఆరె కటికె సంఘ భవనంలో ఆన్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య మాట్లాడుతూ 200 యూనిట్ల విద్యుత్ వినియోగించుకునే లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధిదారులు ఆన్‌లైన్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేశామని ఆమె పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలి

మల్లాపూర్ : గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ గల్ఫ్ ఏజెంట్లను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బహిరంగ మద్యపానం చేయొద్దన్నారు. కలప స్మగ్లింగ్ నేరమన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వ్యక్తులు సంచరిస్తే ఎస్సై సెల్ నంబర్ 8712656796కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో కానిస్టేబుల్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ లేని బస్తీ దవాఖానా

- 45 రోజులుగా ప్రజల ఇబ్బందులు
- రాయికల్ పట్టణంలో పరిస్థితి


బస్తీ దవాఖానాలో వైద్య సేవలందిస్తున్న నర్సింగ్ ఆఫీసర్

రాయికల్: పట్టణంలోని నిరుపేదలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేసింది. ఇందులో డాక్టర్ నితిన్, నర్సింగ్ ఆఫీసర్ వసంత, సిబ్బంది నవ్య పని చేస్తున్నారు. ఈ క్రమంలో డాక్టర్ నితిన్ ఉన్నత విద్య కోసం 45 రోజుల క్రితం సెలవులో వెళ్లారు. అప్పటినుంచి మరో డాక్టర్‌ను నియమించలేదు. దీంతో పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి నర్సింగ్ ఆఫీసర్ వసంత వైద్య సేవలందిస్తూ మందులు పంపిణీ చేస్తున్నారు. అత్యవసరమైతే పేషెంట్లు జిల్లా ఆస్పత్రికి వెళ్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, బస్తీ దవాఖానాలో డాక్టర్‌ను నియమించాలని కోరుతున్నారు.

త్వరలో నియమిస్తాం



రాయికల్ బస్తీ దవాఖానాలో గతంలో పని చేసిన డాక్టర్ ఉన్నత విద్య కోసం సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో మరో డాక్టర్‌ను నియమించే విషయాన్ని ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వైద్యాధికారి పోస్టు భర్తీ చేసి, వైద్య సేవలందేలా చూస్తాం.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


జగిత్యాలలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


యూసుఫ్ నగర్‌లో రైతులు, కూలీలు..


రాయికల్‌లో కేక్ కట్ చేస్తున్న కౌన్సిలర్లు


ధర్మపురిలో బీఆర్ఎస్ నాయకులు..

జగిత్యాల/ కోరుట్ల/కోరుట్లరూరల్/ధర్మపురి/కథలాపూర్/మల్లాపూర్/గొల్లపల్లి/రాయికల్/మేడిపల్లి/సారంగాపూర్/పెగడపల్లి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆలయంలో కేక్ కట్ చేసి పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవిస్తూ రాష్ట్రానికి మరింత సేవలు అందించాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో మహా మృత్యుంజయ ఆయుష్షు హోమం నిర్వహించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర అభివృదికి కేసీఆర్ చేసిన కృషి, అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనియాడారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి: శాసన సభలో సమగ్ర కులగణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో పట్టణంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు బీసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక ఆర్థిక కుల గణన తీర్మానం ఆమోదం పొందడంతో రాష్ట్రంలోని బీసీ వర్గాలకు వరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో శేఖర్, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శివ దీక్షలు ప్రారంభం


శివదీక్ష స్వీకరించిన స్వాములు

రాయికల్: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని అల్లీపూర్‌లో శనివారం భక్తులు శివాలయంలో శివదీక్షలు స్వీకరించారు. శివదీక్ష స్వాములకు అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు భిక్ష సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి అంగనిమఠం భువనేశ్వర్, వినయ్, విక్రమ్, లక్ష్మీనర్సయ్య, చిట్యాల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

19న రాయికల్‌లో శివపార్వతుల కల్యాణం

పట్టణంలో పెద్దచెరువు వద్ద ఈనెల 19న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గంగసహిత పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు తోపారపు రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న బోనాలు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పాఠశాలలో సీసీఈ మానిటరింగ్ టీమ్ పరిశీలన


పరిశీలిస్తున్న మానిటరింగ్ టీమ్ ప్రతినిధులు

కోరుట్లటౌన్: పట్టణంలోని ఓ ప్రయివేట్ హైస్కూల్‌లో శనివారం సీసీఈ మానిటరింగ్ టీమ్ పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఫార్మెటివ్ బుక్స్, మార్కుల పరిశీలించారు. కార్యక్రమంలో సీసీఈ మానిటరింగ్ టీమ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు నల్ల శంకర్, కల్లెడ ప్రణయ్ కుమార్, అందె సుధీర్, హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.ఏ భారీ, ప్రిన్సిపాల్ సలీన్, చైర్మన్ హది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ధర్మపురి: ధర్మపురి నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన పి. రవీందర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు మొగిలి శేఖర్, పందిరి తిరుపతి, ఎంపీవో నరేష్‌కుమార్ ఎంపీడీవోను సన్మానించారు.

కళాశాలల్లో వార్షికోత్సవ సంబరాలు


జాతీయ నాయకుల వేషధారణలో మహాత్మజ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు

రాయికల్: మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖయ్యూం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్‌సీవో గౌతమ్‌రెడ్డి, వెంకటరమణ, మమత, ఆనందం పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటా, పాటలు అలరించాయి.ఈ కార్యక్రమంలో పీఆర్ బీఎం కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు అలరించాయి.కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలోని క్రమశిక్షణ జీవితకాలం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రమాదేవి

జగిత్యాలరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీవో రమాదేవి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో లక్ష్యం మేరకు మార్చిలోపు ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలన్నారు. నర్సరీలో మొక్కలపెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీవో గంగలక్ష్మణ్ పాల్గొన్నారు.

బీసీ కులగణన హర్షణీయం

గొల్లపల్లి: బీసీ కులాల సమగ్ర కులగణన హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి భార్గవరామ్ అన్నారు. తెలంగాణ శాసనసభలో బీసీ కులగణన చేస్తామని తీర్మానం చేయడం సబ్బండ బీసీలు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారన్నారు. దాదాపు 93 ఏళ్ల తర్వాత బీసీ కులగణన చేయడం సాహోపేతమైన నిర్ణయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బంగుడపు తిరుపతి, జిల్లా కార్యదర్శి రాజయ్య, కందుకూరి తిరుపతి, గంగయ్య, హన్మండ్లు పాల్గొన్నారు.

కుల గణనతో నెరవేరిన ఏళ్లనాటి కల

కథలాపూర్: కుల గణన బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో ఏళ్లనాటి కల నెరవేరిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. కథలాపూర్‌లో శనివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టడం సంతోషకరమన్నారు. బీసీ బిల్లు విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సహకరించకపోవడం దారుణమని మండిపడ్డారు. కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బహ్రెయిన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు


బహ్రెయిన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎన్ఆర్ఐలు

రాయికల్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బహ్రెయిన్‌లో ఎన్ఆర్ఐలు బీఆర్ఎస్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సెల్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ మొదటి సీఎంగా కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు.కార్యక్రమంలో సభ్యులు పుప్పాల భద్రి, మగ్గిడి రాజేందర్, సుమన్, చెన్నమనేని రాజేందర్, ఉత్కం కిరణ్‌గౌడ్, రాజలింగం, దేవయ్య, తరుణ్, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జిల్లాస్థాయి సేవా పురస్కారాలు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌కి చెందిన సామాజిక కార్యకర్త గణపతి విష్ణువర్ధన్‌రాజు జీర్ఫ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో సేవా పురస్కార్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ అంగడి ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణానికి చెందిన పుప్పాల నాగరాజు, యువజన సంఘాల నాయకుడు ముబీన్ శనివారం మేడిపల్లిలో ఉత్తమ సామాజిక సేవలకు జీర్ఫ్ సంస్థ సేవా పురస్కార్ అవార్డు అందుకున్నారు. నాగరాజు రక్తదానంతో పాటు ఫంక్షన్‌లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను పేదలకు అందించి ఆకలి తీర్చడంలో విశేషంగా కృషి చేశారు. భారీవర్షాల్లో నిరాశ్రయులైన గంగంపేట కాలనీవాసులను ముబీన్ ఆదుకున్నాడు. ఈ సేవలకు గాను జీర్ఫ్ సంస్థ అందించిన పురస్కారాన్ని జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహారావు చేతుల మీదుగా అందుకున్నారు.

క్యాంపు కార్యాలయానికి కొత్త కళ


ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

ధర్మపురి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి నేడు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గృహప్రవేశం చేయనున్నారు. కొత్త ఎమ్మెల్యే రాకతో క్యాంపు కార్యాలయానికి కొత్త కళను సంతరించుకోనుంది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఐదేళ్ల పాటు క్యాంపు కార్యాలయాన్ని వినియోగించుకున్నారు. కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యే కార్యాలయాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి క్యాంపు కార్యాలయాన్ని జీ ప్లస్ వన్ పద్ధతిలో నిర్మించారు. వాటిలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి ఉండేలా సకల సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. నేడు కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా భారీ బ్యానర్లు, కటౌట్లతో నిండిపోయాయి. కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు.

సైన్స్ టాలెంట్ జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫిజికల్ సైన్స్ ఫోరం, బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. 8వ తరగతి చదువుతున్న హాసిని మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రాజేందర్ తెలిపారు.

రాయికల్: జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భౌతిక, జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 20న జగిత్యాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు బొడ్డుపల్లి రక్షిత (భూపతిపూర్), దీక్షమహి (కేజీబీవీ) విద్యార్థులు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు పొన్నం రమేశ్, శ్రీనివాస్, గాజంగి రాజేశం, కల్వకుంట్ల కార్తీక్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పద్మ, విజయ్‌కుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను వెలికితీసేవి పోటీ పరీక్షలని ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ ఫోరం మండల కో-ఆర్డినేటర్ బందరకంటి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎంఆర్సీలో విద్యార్థులకు మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన అక్షిత, గీతికలను ఎంఈవో భీమయ్య అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రస్తుత సమాజంలో సైన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ సైన్స్‌లో విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్లడానికి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం మచ్చ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సారంగాపూర్ కేజీబీవీ విద్యార్థిని జి. వైష్ణవి (ప్రథమ),కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.హాసిని ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబకాస్ జోనల్ పరీక్షలో పట్టనంలోని రైజింగ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సీనియర్ లెవల్‌లో చిట్యాల నరిన్, జూనియర్ లెవల్‌లో మంద గంగోత్రి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో శ్రీ హర్ష, దనియాల అర్షన్, శీజ, అబ్దుల్ హది, ఎంపికైనట్లు కరస్పాండెంట్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను నిజామాబాద్ డీఈవో దుర్గా ప్రసాద్, జిల్లా అబాకస్ అధ్యక్షుడు జయ సింహ సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

అయ్యప్ప ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు

రాయికల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పునః ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శనివారం యాగశాల సంస్కారం, గణపతిపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నివేదిత కృష్ణారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇబ్రహీంపట్నం: మండలంలోని బర్దీపూర్, మూలరాంపూర్ గ్రామాలలో శనివారం ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కాస సంజీవ్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అఖిల్, నాయకులుపాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన బండి రాధ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం రాయికల్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవనజ్యోతి ఆధ్వర్యంలో మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆర్ఎం ఆనందరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పవన్‌కుమార్, వీఈఎల్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో చింతకుంట లత ఇంట్లో శనివారం వంటగ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు అంటుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో వంట చేస్తుండగా.. సిలిండర్ గ్యాస్ లీకయిందన్నారు. వంటగదిలోని కొన్ని వస్తువులకు మంటలు అంటుకోగా.. సమీపంలో ఉన్న వారు వచ్చి సిలిండర్‌ను బంద్ చేసి మంటలను ఆర్పేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.

ఈత చెట్లు కాల్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లో కొల్ల రవీందర్‌కు సంబంధించిన భూమిలో ఈతచెట్లు కాల్చివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గీత కార్మిక సంఘం నాయకులు బత్తిని మహేశ్, మొత్కూరి కిష్టయ్య శనివారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

బోర్‌వెల్స్ ప్రారంభం

ధర్మపురి: మండలంలోని తీగలధర్మారం శ్రీకృష్ణ గీత ఆశ్రమం, ఎస్సీకాలనీలో తాగునీరు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రెండు బోర్లు వేయించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జంగిలి ప్రభాకర్, గంధం రమేష్, గంగయ్య, కమలాకర్ రావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

నిలిచిన 'మధ్యాహ్న భోజనం'

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో నాలుగు రోజుల నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. ధర్మపురి సివిల్ సప్‌లై గోదాము నుంచి బియ్యం రాకపోవడంతో మధ్యాహ్న భోజనం వండడం లేదు. దీనిపై ఎంఈవో వాసం భీమయ్య వివరణ కోరగా, గోదాముల్లో బియ్యం లేకపోవడంతో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నిలిచిపోయిందని, రెండు రోజుల్లో బియ్యం అందుతాయని తెలిపారు.

సమాచారం..

21న సర్వసభ్య సమావేశం

జగిత్యాల: జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం ఈనెల 21న జిల్లా అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సరిత తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని, అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ పేరిట సూచిక బోర్డు


సూచిక బోర్డు

కోరుట్ల: తహసీల్దార్‌కు తెలియకుండా కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్ట ఏరియాలో ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టిన ఓ బీఆర్ఎస్ కౌన్సిలర్ తీరు వివాదస్పదంగా మారింది. అల్లమయ్యగుట్ట ఏరియాలో తాను కొనుక్కున్న స్థలం ప్రభుత్వ స్థలం అని చెప్పి ఆ ఏరియా కౌన్సిలర్ తనను డబ్బులు డిమాండ్ చేశాడని తూర్పాటి సరిత అనే మహిళ ఆరోపించింది. డబ్బులు ఇవ్వనందుకు తన స్థలం వద్ద రెవెన్యూ అధికారుల పేరిట ఓ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలంగా రాసిపెట్టాడని, తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ విషయంలో తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా తాము ఎక్కడా బోర్డులు ఏర్పాటు చేయలేదని చెప్పారు. పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని తెలిపారు.